కలుషితమే మంచినీరా..?

పల్లె కన్నీరు పెడుతున్నది. కలుషిత జలంతో అల్లాడిపోతున్నది. ప్రభుత్వం ఇంటింటికీ సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటి బావులపై పర్యవేక్షణ, పట్టింపు కరువై చెత్తతో నిండి కంపు కొడుతుండగా, అవే జలాలను సరఫరా చేస్తుండడంతో తాగలేక విలవిలలాడుతున్నది. కనీసం క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకుండా అందిస్తుండడంతో జిల్లాలోని ఎలిగేడు మండల ప్రజానీకం ఆందోళన చెందుతున్నది. ఇప్పటికైనా యంత్రాంగం మేలుకోవాలని, స్వచ్ఛమైన నీటిని అందించాలని కోరుతున్నది.

- రక్షిత మంచినీటి బావులు కంపు కంపు
- చెత్తతో నిండిపోయి చెడువాసన
- క్లోరినేషన్ చేయరు.. బ్లీచింగ్ పౌడర్ చల్లని వైనం
- అదే జలం ప్రజలకు సరఫరా
- ఆందోళన చెందుతున్న పల్లెవాసులు

ఎలిగేడు శ్రీశ్రీనగర్(బీసీ) కాలనీలోని రక్షిత తాగునీటి బావి

ఎలిగేడు, జూలై 11: ఎలిగేడు మండల ప్రజలు రక్షిత మంచినీటి బావుల నీటినే నిత్యం తాగుతుంటారు. అవే వారికి ఆధారం. అయితే అధికారుల పర్యవేక్షణ లేక కొన్ని రోజులుగా నీటి శుద్ధి ప్రక్రియ నిలిచిపోయింది. క్లోరినేషన్ జరుగడం లేదు. ఇంకా బావుల చుట్టూ ఎలాంటి రక్షణ లేకపోవడంతో చెత్తతో నిండిపోతున్నాయి. నీళ్లు కంపు కొడుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటికీ నీరందించేందుకు 23 బావులు, 31 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. బురహన్ మియాపేటలో ఒక బావి, మూడు వాటర్ ట్యాంకులున్నాయి. ధూళికట్టలో నాలుగు చొప్పున బావులు, వాటర్ ట్యాంకులు, ఎలిగేడులో 4 బావులు, 3 వాటర్ ట్యాంకులు, లాలపల్లిలో రెండేసి చొప్పున బావులు, వాటర్ ట్యాంకులు, నారాయణపల్లి, లోకపేట, ర్యాకలదేవిపల్లిలో ఒక్కో బావి, వాటర్ ట్యాంకు, ముప్పిరితోటలో మూడు బావులు, నాలుగు వాటర్ ట్యాంకులు, నర్సాపూర్‌లో ఒక బావి, రెండు వాటర్ ట్యాంకులు, శివపల్లిలో రెండు బావులు, మూడు వాటర్ ట్యాంకులు, సుల్తాన్‌పూర్‌లో రెండు బావులు, నాలుగు వాటర్ ట్యాంకులు, రాములపల్లిలో ఒక బావి, మూడు వాటర్ ట్యాంకులు ఉన్నాయి.

బావులన్నీ కలుషితం..

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు సురక్షిత జలం అందించాలని ఇటీవలే జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటిపై అధికారులు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించుకున్నారు. కానీ ఇప్పటివరకు చర్యలు శూన్యమనే చెప్పాలి. అప్పటి నుంచి నేటి దాకా తాగునీటి బావుల్లో క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టడం లేదని, బ్లీచింగ్ పౌడర్ కూడా కలపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ బావి చూసినా చెత్తతోనే కనిపిస్తున్నదని, 'ఈ నీళ్లేనా మేం తాగుతున్నదని' ఆందోళన చెందుతున్నారు. అసలే వానాకాలమని, ఇలా అయితే తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని వాపోతున్నారు. అయితే ఈ విషయమై ఏఈ యశస్వినిని వివరణ కోరగా, గ్రామాల్లోని మంచి నీటి బావుల్లో బ్లీచింగ్ పౌడర్ కలుపుతున్నామని, క్లోరినైజేషన్ చేస్తున్నట్టు చెప్పారు.

భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై11: సింగరేణి, ఎన్టీపీసీ కింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులు ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో సింగరేణి ఆర్జీ -1, 2, 3, ఎన్టీపీసీ పరిధిలో పెండింగ్ భూ సేకరణపై అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్‌తో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్టీపీసీ స్టేజ్ -2 యాష్ డైక్ నిర్మాణానికి అంతర్గాం మండలం మొగల్‌పహాడ్ గ్రామం వద్ద అవసరమైన 606 ఎకరాల భూ సేకరణ కోసం ప్రిలిమినరీ ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేసి, నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులకు సూచించారు. పైప్ లైన్ కారిడార్ ఏర్పాటుకు రామగుండం మండలం మల్యాలపల్లి, అంతర్గాం మండలం కుందనపల్లిలో 45 ఎకరాల భూ సేకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్టీపీసీ సంస్థ సేకరించిన 9543.10 ఎకరాల భూముల మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి చేసి ధరణి పోర్టల్‌లో రికార్డులను అప్ డేట్ చేయాలన్నారు. సింగరేణి పరిధిలోని పెండింగ్ భూ సేకరణకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ఆర్జీ-1 పరిధిలో ముంపు గ్రామమైన సింగిరెడ్డిపల్లి ఆర్ అండ్ ఆర్ ప్రక్రియ పూర్తవుతున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆర్జీ-3 పరిధిలోని బుధవారంపేట, రత్నాపూర్, అక్కెపల్లి, లద్నాపూర్ భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ స్థితిగతులపై సమీక్షించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, సింగరేణి, ఎన్టీపీసీ, రెవెన్యూ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పడాలి

కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల విద్యపై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు, కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలల మానిటరింగ్, విద్యా బోధన విధానాలు, ప్రస్తుత విద్యా సంవత్సరం రూపొందించుకున్న లక్ష్యాలు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారం కాంప్లెక్స్ పరిధిలో కనీసం మూడు పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరు కావాలని, హాజరు తక్కువ ఉన్న విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో చేరుకునేలా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. ప్రతి నెల 3న కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష జరపాలని, విద్యా ప్రమాణాల పురోగతిపై చర్చించాలన్నారు. ఈ సమావేశాల మినిట్స్ కాపీలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, జిల్లా అకడమిక్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సన్మానగ్రహీతలతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, దాసరి, పుట్ట

బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

జూలపల్లి, జూలై 11 : బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులను మండల కేంద్రంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సన్మానించారు. ఐదేండ్ల పాలన పనితీరుపై మాట్లాడారు. భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేననీ, ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ప్రజాక్షేత్రంలో నిలబడాలని పేర్కొన్నారు. ఇక్కడ జిల్లా గ్రంథాయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, మాజీ వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు తమ్మడవేని మల్లేశం, కత్తెర్ల శ్రీనివాస్, పల్లె స్వరూప, మాజీ కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్, మాజీ ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు విశారపు వెంకటేశం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లోక రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మయ్య మృతి తీరని లోటు

పెద్దపల్లి టౌన్, జూలై 11: పటణంలోని తిలక్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోట సమ్మయ్య ఆనారోగ్యంతో మృతి చెందగా గురువారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమ్మయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మయ్య మృతి బాధాకరమని, క్రమ శిక్షణగల నాయడిని బీఆర్ఎస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటని ఆవేదన చెందారు. ఇక్కడ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు దాసరి ఊష, కౌన్సిలర్లు నాంసాని సరేశ్‌బాబు, పూదరి చంద్రశేఖర్, పెద్ది గీతాంజలి-వెంకటేశ్, పెచాల రమదేవి-శ్రీధర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజుకుమార్, చొప్పరి అన్వేశ్, కాశిపాక వాసు, బోడ్డుపల్లి రమేశ్, పల్లే మధు, కమటం శ్రీధర్, గొట్టేముక్కల శ్రీనివాస్, భాదర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

సుల్తానాబాద్ రూరల్,జూలై 11: గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ తీశారు. కుటుంబ నియంత్రణ, అధిక జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్‌లు, సూపర్ వైజర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థదాయకం

కాల్వశ్రీరాంపూర్, జూలై11: అధిక జనాభా అనర్థ దాయకమని హెచ్ఈవో ఆరెల్లి లక్ష్మణ్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని కూనారం ప్రభుత్వ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో జనాభా పెరుగు దలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, వైద్య సిబ్బంది, హెచ్ఎం మలికార్జున్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

పెద్దపల్లి, జూలై11: పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో సెప్టిక్ ట్యాంక్ సంపులో పడి మృతి చెందిన జాన్ వెస్లీ కుటుంబాన్ని ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని పెద్దపెల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షను దాసరి ఉష కోరారు. గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ, జిల్లా కేంద్ర దవాఖానలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు పారిశుధ్య నిర్వహణ, 24 గంటల పాటు విద్యుత్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారంగా రూ. 10 లక్షలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రమాదంపై పూర్తి దర్యాప్తు చేయించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వీర బోయిన శ్రీనివాస్, రెవెల్లి స్వామి, నాయకులు గుర్రం సంపత్, ఎండీ ఖదీర్, కల్లెపల్లి రవి, తాళ్లపల్లి అంజయ్య, సాయి వంశీ, పల్లె రాకేష్ , దరుముల రవి, కొత్తూరు రాజు, ఇల్లందుల ప్రశాంత్, ఇల్లందుల రాజకుమార్ పాల్గొన్నారు.

అప్పన్నపేటలో డీఎల్పీవో విచారణ

పెద్దపల్లి రూరల్, జూలై 11: అప్పన్నపేటలో పంచాయతీ కార్యదర్శి పలు రకాల అవినీతి ఆరోపణలకు పాల్పడ్డారని, బిల్లుల చెల్లింపుల విషయంలో పలు తప్పిదాలు చేశారని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్ భర్త చీకటి పోచాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై డీఎల్పీవో వేణు గోపాల్ గ్రామస్తుల సమక్షంలో గురువారం విచారణ జరిపారు. రికార్డులు, చెక్కులు, ఎంబీ బుక్కులు, చెక్‌లిస్టులను పరిశీలించి విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో తెలిపారు. ఇక్కడ మాజీ ఉప సర్పంచ్ బొండ్ల శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, రాపెల్లి శ్రీనివాస్, మొల్లూరి విజయారావు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు

కమాన్‌పూర్, జూలై 11: గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు రామగుండం సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ హిమ బిందు సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ వద్ద సిమ్స్ ఆధ్వర్యంలో దత్తత కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రామగుండం ప్రభుత్వ దవాఖానలో అన్ని రోగాలకు సంబంధించి నిపుణులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎంవో అప్పారావు, మండల ప్రత్యేక అధికారి ఆదిరెడ్డి, తహసీల్దార్ ఆరిఫొద్దీన్,వైద్యులు విజిత్ గోపీకృష్ణ, రాజీవ్, అవినాష్, శ్రీనివాస్, అఖిల్, ఝాన్సీ, రాజు పాల్గొన్నారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, ఇన్చార్జి ఎంపీడీవో శేషయ్య సూరి, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకట స్వామి, మాజీ సర్పంచ్ నీలం సరితా శ్రీనివాస్, రవీందర్, నాగ రాజు, కార్యదర్శి మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

ధర్మారం,జూలై11: కాంగ్రెస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలిగా గోపాల్‌రావుపేట మాజీ ఎంపీటీసీ జనగామ లక్ష్మిని నియమించినట్లు ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు. ధర్మపురిలోని క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు.

విధుల బహిష్కరణ

ధర్మారం,జూలై11:సిద్దిపేట బార్ అసోసియేషన్ సభ్యుడు ఎం రవికుమార్‌పై అక్కడి పోలీసులు దాడి చేయడంపై నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల చర్యను ఖండించారు. ఈ ఘటనను నిరసిస్తూ వారు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఆకారి రాజేశం,వైస్ ప్రెసిడెంట్ బొట్ల లక్ష్మీనర్సయ్య,జాయింట్ సెక్రటరీ నూనె సత్యనారాయణ,ట్రెజరర్ ఎంపల్లి ప్రకాష్,స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ భీమారపు సంపత్ కుమార్, సీనియర్ ఈసీ మెంబర్ గడ్డం లింగారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడమే లక్ష్యం

పెద్దపల్లి టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 11 : రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడమే సీఎం రేవంత్ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామంలో ఎంపీఎంబీ నిధులు రూ.42 లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టారనీ, మన ఉరు మన బడి పథకంలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపడుతామని, పెద్దపల్లితో పాటు సుల్తానాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పార్టీ నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, అంతటి అన్నయ్య గౌడ్, దన్నాయక్ దామోదర్‌రావు, చిలుక సతీష్, వేగేశం అబ్బయ్యగౌడ్, ముస్త్యాల రవీందర్, అమరిశెట్టి రాజలింగం, అమిరిశెట్టి తిరుపతి, కుమార్ కిషోర్, గాదాసు రవీందర్, దున్నపోతుల రాజయ్య, మహ్మద్ రఫిక్, చింతల రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

పెద్దపల్లి టౌన్, జులై 11: పెద్దపల్లి మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విజయరమణా రావు అన్నారు. 8,9 వార్డుల్లో డ్రైనేజీలు, రోడ్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్యలు వెంటవెంటనే పరిష్కారిస్తానని చెప్పారు. పట్టణంలో వార్డు సందర్శన, వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. వార్డులో మొక్కలు పంపిణీ చేశారు. విద్యా నగర్, చీకురాయి రోడ్‌లోని డ్రైనేజీ, మిషన్ భగీరథ పైప్‌లైన్లు నూతనంగా అమృత్ మహోత్సవం కార్యక్రమం కింద పనులు చేయనున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు ఆగస్టులో ప్రారంభిస్తామని తెలిపారు. ఇక్కడ మున్సిపల్ కమిషన్ ఆకుల వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, కౌన్సిలర్లు బొంకూరి భాగ్యలక్ష్మి-సురేందర్, ఎరుకల కల్పన-రమేశ్, బోడ్డుపల్లి సంపత్, నాయకులు సర్వర్‌బాయ్, ఈర్ల సురేందర్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 11: నూతన చట్టాలపై ప్రతీ న్యాయవాది అవగాహన కలిగి ఉండాలని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి రాపోలు భాస్కర్ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం న్యాయవాదులకు నూతన చట్టాలపై రూపొందించిన పుస్తకాలను న్యాయవాదులకు పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సబ్ జడ్జి భృంగి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జూనియర్ సివి ల్ జడ్జి ఎన్ మంజుల, రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ, బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గోశిక ప్రకాశ్, పులిపాక ప్రవీణ్‌కుమార్, దూడపాక లింగస్వామి, ఇరుగురాల మహేందర్, ఇరుగురాల సంతోష్, దామ సంతోష్, గడమళ్ల వరలక్ష్మి, రమ్య, న్యాయవాదులు ఉన్నారు.

24గంటల వైద్యసదుపాయానికి కలెక్టర్‌కు వినతి

పాలకుర్తి, జూలై11: పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 24గంటల వైద్య సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరం, గోదావరిఖనికి 40కిలోమీటర్ల దూరంలో ఉన్న మారుమూల పల్లెలకు పుట్నూర్ ఆరోగ్యకేంద్రం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. రాత్రివేళల్లో విషపురుగులు కుట్టిన, విషజ్వరాలు సోకిన ప్రజలకు వైద్యం కోసం ఇబ్బందిపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. స్థానికంగా పుట్నూర్ ఆరోగ్యకేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఎక్కువ సిబ్బందిని నియమించి,24 గంటల వైద్యసదుపాయం అందించాలని గ్రామ యువకులు వైద్యసరేశ్, తోటప్రశాంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 11: సిద్దిపేటలో న్యాయవాది ఎం రవికుమార్‌పై అక్కడి ఏఎస్ఐ ఉమారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం గోదావరిఖని న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ విధుల బహిష్కరణతో గోదావరిఖనిలోని ఆదనపు జిల్లా న్యాయస్థానం, సబ్‌కోర్టు, మున్సిఫ్‌కోర్టు కాంప్లెక్స్‌లోని కోర్టులో కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనంతరం మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్ ఎదుట సంఘం(ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఇక్కడ ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజ, ఐలు బాధ్యులు గోశిక ప్రకాశ్, ఎరుకల ప్రదీప్ కుమార్, షహనవాజ్, న్యాయవాదులు పుర్మ శ్రీనివాస్, గుడికందుల భూమయ్య, సానం మురళి, చెలికల శ్రీనివాస్‌తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో జేఏసీ నేతల గేట్‌మీటింగ్

జ్యోతినగర్, జూలై 11: రామగుండం ఎన్టీపీసీ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల అగ్రిమెంట్ పెండింగ్ సమస్యలపై గురువారం ఎన్టీపీసీ లేబర్‌గేట్‌లో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్న కార్మికుల హక్కుల ఒప్పందాన్ని యాజమాన్యం తుంగలో తొక్కి కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తుందని వారు మండిపడ్డారు. ఐటీఐ కార్మికుల ప్రమోషన్ పాలసీని అమలు పరుచాలన్నారు. 60 ఏండ్లు దాటిన కార్మికులను తొలగించరాదన్నారు. పోలీసు వెరిఫికేషన్, మెడికల్ పరీక్షల పేరిట చేపడుతున్న విధానాలను మానుకోవాలన్నారు. గత అగ్రిమెంట్ ప్రకారం కార్మికుడి అలవెన్స్ రూ. 1,020 చెల్లించాలన్నారు. డిపెండెంట్ కార్మికులకు పూర్తి అలవెన్స్‌లు అమలు, గతంలో మాదిరిగా ఏడాది పాటు గేస్‌పాస్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనియేడల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ జేఏసీ నాయులు బాబర్ సలీంపాషా, కౌశికహరి, నాంసాని శంకర్, చిలుక శంకర్, ఈ భూమయ్య, ఏ శ్రీనివాస్, శంకర్, లక్ష్మారెడ్డి, చందర్, రాజమల్లయ్య, నాగభూష ం, బుచ్చన్న, శ్రీనివాస్, లక్ష్మణ్ ఉన్నారు.

ఏఐటీయూసీ రిలే దీక్షలు

రామగిరి, జూలై 11: బొగ్గు గనుల వేలంను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు ఏఐటీయూసీ అధ్యక్షులు, వేజ్‌బోర్డు సభ్యులు సీతారామయ్య గురువారం దీక్షా శిబిరంను సందర్శించి మాట్లాడారు. సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం గనుల వేలం వేస్తుందన్నారు. ఈ విధానాలకు స్వస్తి పలకాలని లేదంటే సంస్థ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి జూపాక రాంచందర్, సురేందర్, రాజేందర్, నూనె కొమురయ్య, ధర్మన్న, సంపత్, రాజేంద్ర రాథోడ్, రవీందర్, వెంకటేశ్వర్లు, కనకయ్య పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన

రామగిరి, జూలై 11: కల్వచర్లలో ఏవో ప్రమోద్‌కుమార్ వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎత్తుమళ్లలో విత్తనం పోసిన తర్వాత నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలనీ, నీరు నిల్వ ఉంటే విత్తనం మురిగిపోతుందన్నారు. జూన్ 20 నుంచి జూలై 15 వరకు నార్లు పోయడం పూర్తి కావాలని సూచించారు. అనవసరంగా రసాయన మందులు వాడం వల్ల భూసారం తగ్గుతుందని, సేంద్రియ ఎరువులను మాత్రమే వాడాలన్నారు.

వేలానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి

దీక్షలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని, జూలై 11: తెలంగాణలోని సింగరేణికి బొగ్గు గనులను ఇవ్వకుండా వేలం వేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపెల్లి స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ పేర్కొన్నారు. వేలానికి వ్యతిరేకంగా ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారంతో నాలుగో రోజుకు చేరాయి. దీక్షల్లో కూర్చున్న ఓసీపీ 5, సివిల్, సీఎస్‌పీ, ఎస్అండ్‌పీసీ జీఎం కార్యాలయంకు చెందిన కార్మికులకు దీక్ష దండాలు వేసి దీక్షను ప్రారంభించి వారు మాట్లాడారు. కార్మికులు చేస్తున్న ఈ పోరాటంలో అధికారులు కలిసిరావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడితో గనులను సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోల్ బెల్ట్ ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీయాలన్నారు. తెలంగాణలో ఉన్న ఏకైక అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిని ప్రైవేటీకరణ నుంచి కాపాడుకునేందుకు కార్మికవర్గం ఐక్య పోరాటాలకు తరలిరావాలని వారు పిలుప